క్లుప్తంగా

గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు రాక

కాకుమాను: విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు స్థానిక శాఖా గ్రంథాయల అధికారి జోగి మోహనరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.ఆరు నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియం చదివే విద్యార్థులకు పుస్తకాలు జిల్లా గ్రంథాయలం నుంచి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి చదుకోవాలని సూచించారు.

జీఈసీలో ఉచిత కంటి వైద్య శిబిరం



యనమదల (ప్రత్తిపాడు): మండల పరిధిలోని యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, నేత్రాలయ ఐకేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ షేక్ సైదా, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకోటయ్య, కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో 3వ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. నారాకోడూరులోని తెనాలి రోడ్డులో నేటి నుంచి రెండు రోజుల పాటు జరిగే ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను పొన్నూరు శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగ సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెద్ది శివయ్య, వై ఉదయభాస్కర్, చావలి ఏడుకొండలు యాదవ్, జంపని సూర్యనారాయణ, గైరుబోయిన వెంకట సుబ్బయ్య, తొలుచూరి కాటంరాజు, గుమ్మా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుట్టగొడుగుల పెంపకం శిక్షకులు తోట జయచంద్ హాజరయ్యారు. తనుశ్రీ మష్రూమ్స్ సంస్థ ద్వారా వ్యవసాయ విభాగ విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకం గురించి అవగాహన కల్పించారు. కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్, భారతదేశ వ్యవసాయ భూభాగంలో పుట్టగొడుగుల పెంపకం యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ శిక్షణ తరగతులు మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక వ్యవసాయ విధానాలలో వచ్చిన మార్పులను విద్యార్థులకు వివరించామని, పుట్టగొడుగుల పెంపకం యొక్క అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ ఎం.కిషోర్‌బాబు, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు, ఆర్గనైజింగ్ కమిటీ డాక్టర్ పి.అవినాష్, డాక్టర్ ఎం.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సీటీస్కాన్ ఏర్పాటుకు భూమిపూజ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకులకిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో సీటీస్కాన్ పరికరం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతుల బడ్జెట్ కింద రూ.5 కోట్లు కేటాయించారన్నారు. అందులో భాగంగా సీటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు జీజీహెచ్‌కు రెండో సీటీ స్కాన్ పరికరం అవసరమని భావించి బడ్జెట్ విడుదల చేశారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎం.టి.కృష్ణబాబు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

జగనన్నతోనే ఆదారం

- సంక్షేమ పథకాలతో మెరుగైన జీవనం
- విరాళాలతో మహానేత వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసుకున్న నేతన్నలు



మగ్గం పనిలో చేనేత కార్మికుడు

తెనాలి: రెక్కలు ముక్కలయ్యేలా పని.. రోజంతా కష్టపడినా వచ్చేది అరకొర ఆదాయమే.. మగ్గంలో బక్కచిక్కిన బతుకులు.. ఆ'దారం' కోసం ఆరులుచాసేవారు.. పనిదొరకటం కూడా కష్టంగానే ఉండేది. చేనేత కార్మికులు అనగానే దుర్భర జీవితాలు అనిపిస్తాయి. కులవృత్తిని వదులుకోలేక మరో పనికి వెళ్లలేక నేతను నమ్ముకున్న కుటుంబాలకు ఆకలి మాత్రమే తోడు, అనారోగ్యం చేనేత కుటుంబాలను విచ్ఛిన్నం చేయడం ఎంతోకాలంగా చూస్తున్నాం. కార్మికుల్లో ఎవరిని కదిలించినా కుటుంబానికో కన్నీటి వ్యథ ఉండేది. ఆకలి చావులు నిశ్శబ్దంగా సమాధి అవుతూ వస్తున్నాయి. ఇదంతా గతం... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో చేనేత కార్మికులు కుటుంబాల్లో వెలుగులు నిండాయి.



సామాజిక పింఛన్లతో..

డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేనేతలను పట్టించుకున్నారు. 50 ఏళ్లకే సామాజిక పింఛన్లను మంజూరు చేయించారు. రూ.250 కోట్లు కేటాయించి నూలు, రంగులు, ఇతర ముడి సరుకుల్లో రాయితీలు కల్పించి ఆదుకున్నారు. ఆయన తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చాక చేనేతల కార్మికులకు మరింత మేలు జరిగింది. సంక్షేమ పథకాలతో వారి జీవితాల్లో చిరునవ్వులు చిందించేలా చేశారు. రెక్కల కష్టంతో మగ్గాలు నేస్తున్న కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధితో మెరుగైన జీవనం సాగిస్తున్నారు. ఇందుకు తెనాలి రూరల్ మండలం జగ్గడిగుంటపాలెంలో ప్రగడ కోటయ్యనగర్ ప్రత్యక్ష నిదర్శనం.

ప్రగడ కోటయ్య నగర్‌లో మగ్గాలు..

జగ్గడిగుంటపాలెం గ్రామ ఓటర్లు నాలుగు వేల మంది ఉంటారు. వీరిలో పద్మశాలీల ఓట్లు 1600 ఉంటాయి. గ్రామంలోని ప్రగడ కోటయ్యనగర్‌లో నివాసం. తెనాలి నియోజకవర్గం మొత్తంలో 58 సొంతిళ్లలో చేనేత మగ్గాలున్నాయి. వీరిలో 45 మంది ప్రగడ కోటయ్యనగర్లో సొంతగా నేత నేస్తున్నారు. కొందరు సంప్రదాయ గుంటమగ్గాలనే వినియోగిస్తుండగా, మరికొందరు ఐరన్ ఫ్రేమ్/చెక్క స్టాండ్‌మగ్గాలను వినియోగిస్తున్నారు. 45 మంది నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.20 లక్షలు చొప్పున ఆర్థికసాయం చేసింది. మొత్తం 392 మందికి పింఛన్లు వస్తున్నాయి. అంతేకాకుండా కోవిడ్ 19 విపత్కర పరిస్థితుల్లోనూ రెండుసార్లు నేతన్న నేస్తం పథకం కింద చేనేత కార్మికులకు సీఎం వైఎస్ జగన్ సాయమందించారు.



లబ్ధిదారులు స్వయంగా నిర్మించుకున్న మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం

ఇళ్లస్థలాలు మంజూరు..

ఇక్కడి నేత కుటుంబాలకు జాతీయ చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత తెనాలి-1 క్లస్టర్ మంజూరైంది. వీరికి 90 శాతం రాయితీపై ఐరన్ ఫ్రేమ్స్ లూమ్స్, చెక్క లూమ్స్, సోలార్ లైటింగ్ యూనిట్లు పంపిణీ చేశారు. ఒక్కోటి రూ.1.20 లక్షల విలువైన 20 వర్క్‌షెడ్లు మంజూరయ్యాయి. వీటిలో 10 వర్క్‌షెడ్లను ఇప్పటికే నిర్మించుకున్నారు. ఇవికాకుండా అదనంగా శిక్షణ కూడా ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో చేనేత వర్గాలకు గరిష్ఠంగా సంక్షేమం లభించిందని కొడాలి క్రాంతి చెప్పారు. ఆ కృతజ్ఞతతోనే కేవలం చేనేత లబ్ధిదారులే చందాలేసుకుని ఏర్పాటు చేసుకున్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

సొంత మగ్గం పెట్టుకున్నా..



షావుకారు దగ్గర గుంటమగ్గం కూలికి నేసేవాణ్ణి. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు ఇస్తున్నారు. చేనేత పింఛను నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. దీనితో సొంతంగా స్టాండ్ మగ్గం పెట్టుకున్నా. నా భార్యకు చేయూత రూ.18,750 వస్తున్నాయి. సొంతిల్లు ఉన్నందున ఇళ్లస్థలానికి పెట్టుకోలేదు.

– ఉద్దంటి హరిప్రసాద్, చేనేత కార్మికుడు

మాస్టర్ ట్రైనర్‌ను నేను...



పోచంపల్లి టై అండ్ టై ఇక్కత్‌లో డైయింగ్, డిజైనింగ్ మాస్టర్‌ను. పోచంపల్లి చీరెలు, డ్రెస్ మెటీరియల్స్, చున్నీలు, షర్టింగ్ చేస్తాం. నేతన్నలకు శిక్షణ ఇస్తుంటాను. విజయవాడ చేనేత జాతీయ భవన్ సర్టిఫికెట్ ఇచ్చింది. నేతన్న నేస్తం, పింఛను వస్తున్నాయి. వర్క్‌షెడ్, సోలార్ లైట్ యూనిట్ కూడా ఇచ్చారు.

– పానుగంటి శ్రీనివాసరావు, చేనేత కార్మికుడు

చాలా సంతోషంగా ఉంది...



40 ఏళ్ల నుంచి గుంటమగ్గం నేస్తున్నా. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాకోసం ఎంతో చేశారు. నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు వచ్చాయి. ప్రతినెలా చేనేత పింఛను తీసుకుంటున్నా. నేత ఆదాయానికి ప్రభుత్వ సాయం తోడైంది. నా భార్యకు చేయూత కింద రూ.18,750 వస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

–జొన్నాదుల లక్ష్మీనారాయణ, చేనేత కార్మికుడు

గతంలో ఏ సాయం అందలేదు...



నా వయసు 60 ఏళ్లు. 45 ఏళ్లుగా నేత నేస్తున్నా. గతంలో నాకు ఏ సాయం అందింది లేదు. ఈ ప్రభుత్వంలో నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు వస్తున్నాయి. చేనేత పింఛను నెలనెలా రూ.3 వేలు ఇస్తున్నారు. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. రెండో కుమార్తె బీటెక్ చదివినపుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది.

– కొండా వెంకట సుబ్బారావు, చేనేత కార్మికుడు

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కొల్లిపర: రాబోయే ఎన్నికలకు ప్రతి గ్రామంలోని పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మండల పరిపాలనాధికారి వి.చంద్రమోహన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని దావులూరుపాలెం, హనుమాన్‌పాలెం, బొమ్మువానిపాలెం, అన్నవరం, అన్నవరపు లంక తదితర గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను బీఎల్ఓ ద్వారా తెలుసుకుని, కేంద్రాలను పరిశీలించి, ఈవీఎంల ద్వారా ఓటు ఏ విధంగా వేయాలనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎంపీడీఓ విష్ణుప్రసాద్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

శ్రీసంత్ సేవాలాల్ 285వ జయంతి



తెనాలి: సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని గురువారం రాత్రి చినరావూరుతోట సుగాలి కాలనీలో ఘనంగా నిర్వహించారు. జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో సేవాలాల్ చిత్రపటం వద్ద కేక్‌ను కట్‌చేశారు. దీనికిముందు తెనాలి దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ విజయ్ కొర్రా కాలనీవాసులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. జయంతి వేడుకలో న్యాయమూర్తి మోతీలాల్, సేవాసంఘం అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్, రాము, లక్ష్మణ్, శత్రు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనారుషి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: పట్టణ షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న శ్రీ భద్రావతి సహిత భావనారుషి స్వామివారి వార్షిక కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మార్కెట్ సెంటర్‌లో ఉన్న కల్యాణ మండపంలో భావనారుషిస్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. పద్మశాలి ఆడపడచులు, పద్మశాలీయుల బంధువులు, పట్టణంలోని ప్రజలు కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ బిట్రా రామలింగేశ్వరరావు, పద్మశాలీ సంఘ అధ్యక్షుడు బట్టు జగత్ కోటి నరేంద్రబాబు, సెక్రటరీ కొడాలి క్రాంతి కుమార్, దేవస్థాన పాలక మండలి సభ్యులు గుంటి ధనలక్ష్మి, తాడిపర్తి చంద్రశేఖరరావు, కొతరపు వెంకటరమణ, పోలిశెట్టి కోటేశ్వరరావు, సంఘ పెద్ద శ్రేష్ఠులు జొన్నాదుల కృష్ణ, సత్యనారాయణ, వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివసత్యనారాయణ, వరప్రసాద్, అధిక సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు.

బాలల్లో క్యాన్సర్ లక్షణాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పావనీ ప్రియాంక

తెనాలి: అంతర్జాతీయ పిల్లల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లల్లో వచ్చే క్యాన్సర్ లక్షణాలు, నివారణపై డాక్టర్ పావనీ ప్రియాంక అవగాహన కల్పించారు. కీళ్లనొప్పులు, బరువు తగ్గడం, ఎక్కువగా అలసిపోవటం, దీర్ఘకాలంగా కంటిలో తెల్లని మచ్చ వంటివి పిల్లల క్యాన్సర్‌లో కనిపించే లక్షణాలుగా తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవటం, సూర్యకిరణాలు తగిలేవిధంగా చూసుకోవటం, వ్యాక్సిన్స్ వేయించుకోవటం, ఆరోగ్యం మెరుగ్గా ఉండేలా చూసుకుంటూ క్యాన్సర్ నుంచి దూరంగా ఉండొచ్చని తెలిపారు. బాల్యంలో క్యాన్సర్ నుంచి బయటపడిన వారికి యుక్తవయసు వరకు మానసిక ఆందోళన ఉండొచ్చని చెప్పారు. ప్రాణాలతో పోరాడి క్యాన్సర్‌ను గెలిచిన పిల్లల్లో పలువురికి కొన్ని అనారోగ్య సమస్యలు రావొచ్చని చెప్పారు. దీర్ఘకాలంగా ఆందోళన, బాధ, క్యాన్సర్ వస్తుందేమోనన్న భయం వంటివి పిల్లల్లో క్యాన్సర్‌కు కారణాలుగా తెలిపారు. అంతర్జాతీయ పిల్లల క్యాన్సర్ దినోత్సవంపై అవగాహనకు గుర్తుగా గోల్డ్ రిబ్బన్‌తో సూచిస్తారని వివరించారు. 39వ వార్డు కౌన్సిలరు వీర్లపాటి విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, నాళం శ్రీమన్నారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న స్రవంతి

పొన్నూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణతో కూడిన విద్య అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్నటువంటి విపరీతమైన మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ప్రతి విద్యార్థికి మొక్కలు పెంచివలసిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శోభాచంద్, శ్రీనివాసరెడ్డి, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా, జిల్లా సైన్స్ అధికారి ఎ.రవికుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, శివకుమార్, పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపూడిలో వైద్యశిబిరం

ఫిరంగిపురం: రేపూడి గ్రామంలో ఆరు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. నుదురుపాడు, ఫిరంగిపురం, మందపాడు, పెదపలకలూరు, మేడికొండూరు పీహెచ్‌సీలకు చెందిన సుమారు 60 మంది ఆరోగ్యసిబ్బంది ఆరు వైద్యసేవలందించారు. సుమారు 985 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు.

సాయి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు



తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగులోని సాయి క్షేత్రంలో వసంత పంచమి మహోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. సరస్వతి అమ్మవారికి పూజలు జరిపారు. గాయని శారదా చలపతి మణిద్వీప వర్ణన, పూజార్చన, లలిత సహస్రనామ పారాయణ చేశారు. అమ్మవారికి వేద పండితులచే అర్చన చేయించారు. అనంతరం విద్యార్థులకు వేద పండితులచే సరస్వతీమాత ఆశీర్వచనం ఇప్పించారు. అమ్మవారి పూజలో ఉంచిన నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు అందజేశారు. శ్రీ షిరిడీ సాయి సేవాట్రస్ట్ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎంవీ హరిప్రసాదరావు, సెక్రటరీ శ్రీవల్లి, ట్రస్టీలు రాజా, పార్వతి, సాయిక్షేత్రం కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రత, మెరుగైన ఉపాధే లక్ష్యం

నగర కమిషనర్ నిర్మల్ కుమార్

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టం(నమస్తే) పథకంలో ప్రతి ఒక్క పారిశుద్ధ్య కార్మికుడు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, హెల్పర్లలతో ఆయా పనులలో పరోక్షంగా ప్రత్యక్షంగా పనిచేస్తున్న కార్మికుల భద్రతతో పాటు మెరుగైన ఉపాధి కల్పించడమే నమస్తే కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. పథకంలో నమోదు చేసుకున్న వారికి ప్రత్యేక సదుపాయాలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య సేవలు అందుతాయని వివరించారు.

నగరంలో ఇంటింటి వైద్య సర్వే

గుంటూరు మెడికల్: నిరంతరం వైద్య సేవల్లో భాగంగా స్థానిక శారదా కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, లాంచెస్టర్ ప్రాంతంలో ఏడు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం తెలిపారు. అతిసార వ్యాధి నివారణ, నియంత్రణలో భాగంగా రౌండ్ ది క్లాక్ ప్రాతిపదికన నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శారదా కాలనీలో 3 వైద్య శిబిరాలు, ఇందిరా ప్రియదర్శి కాలనీలో 2, లాంచెస్టర్ పరిధిలో 2 వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 35 వైద్య బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహించామన్నారు. 10,813 గృహాలు సందర్శించి, 1380 ఓఆర్ఎస్ ప్యాకెట్స్, 196 జింక్ మాత్రలు, వ్యాధికి కారణాలు, వ్యాధి లక్షణాలు, చికిత్స నివారణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 26 మంది అనుమానిత అతిసార బాధితులను గుర్తించి అందులో 10 మందికి ఇంటి వద్దనే చికిత్స అందించినట్లు వెల్లడించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, తాజా ఆహార పదార్థాలు మాత్రమే భుజించాలని ప్రజలకు వివరించారు. నిలువ ఉన్న, కుళ్లిన ఆహార పదార్థాలు పండ్లు తీసుకోరాదని ప్రజలను చైతన్య పరిచినట్లు తెలిపారు. వైద్య సహాయం కోసం కంట్రోల్ రూమ్ 8341396104, 7207595104 నెంబర్లుకు ఫోన్ చేసి సహాయం పొందాలని డాక్టర్ కె.కొర్రా విజయలక్ష్మి తెలిపారు.

సహకార సంఘాల ఫెడరేషన్ ఏర్పాటుకు ముందడుగు

- హాజరుకానున్న సహకార సొసైటీల పాలక వర్గాలు
- కాకతీయ సహకార సొసైటీస్ చైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ కాంతారావు

తెనాలి: రాష్ట్రంలో సహకార ఉద్యమానికి పట్టుకొమ్మగా నిలిచిన తెనాలిలో దీర్ఘకాలం తర్వాత మరో ముందడుగు పడనుంది. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఆవిర్భావానికి పట్టణం వేదిక కానుంది. ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు స్థానిక కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ సొంత భవనం పై అంతస్తు ప్రారంభోత్సవం వేళ.. ఫెడరేషనుపై నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గాలు ఈ సమావేశంలో పాల్గొంటాయని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలోని కాకతీయ సహకార బ్యాంక్‌లో గురువారం విలేకరుల సమావేశంలో డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, సీఈవో కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, పీఆర్‌వో చెరుకూరి సతీష్‌తో కలిసి డీఎల్ కాంతారావు మాట్లాడారు. దేశంలో జాతీయ బ్యాంకులు, అర్బన్ బ్యాంకులతో సమానంగా సహకార సొసైటీలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. సహకార సొసైటీ చట్టం కింద రాష్ట్రంలోని అన్ని సొసైటీలు ఫెడరేషన్‌గా ఏర్పాటై రిజిస్టరు చేసుకోగలిగితే ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రజలకు మరింత సేవలను అందించే వెసులుబాటు ఉంటుందని చెప్పారు.సహకార ట్రిబ్యునల్‌లో కేసు వేయటం, విచారణలో జాప్యంతో సొసైటీలు ఆర్థికంగా నష్టపోతున్నాయని కాంతారావు చెప్పారు. పాలకవర్గాలన్నీ కలిసి ఫెడరేషనుగా ఏర్పాటైతే సేల్ ఆఫీసరు నియామకం కోసం ప్రభుత్వాన్ని కోరవచ్చని వివరించారు. ఇలా పలు రకాల ప్రయోజనాల కోసం ఫెడరేషన్ ఆవిర్భావానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలతో ఎంతో మేలు

- జిల్లా మలేరియా అధికారి తలాటం సుబ్బరాయణం
- పినపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. జగనన్న సురక్ష మెడికల్ క్యాంప్‌ను పినపాడులోని మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. వైద్యశాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లోకే స్పెషలిస్టు వైద్యులను తీసుకువచ్చి వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. పేదలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, డాక్టర్ పి.హర్షవర్ధన్, డాక్టర్ వి.లిఖిత, డాక్టర్ ఎం.రూపేష్‌కుమార్, డాక్టర్ సుబ్బారావు, డీపీఎం జంగం శ్యామ్, అసిస్టెంట్ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరాణాధికారి బాలచంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.